క్లుప్తంగా

అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా శిక్షణ

సూర్యాపేటటౌన్ : అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత క్రీడా శిక్షణ నిర్వహిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ క్రీడా శిక్షణలో వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్, చెస్, క్యారం, కరాటే తదితర క్రీడల్లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని ఏవీఎం హై స్కూల్‌లో ప్రతి రోజు 6.30గంటల నుంచి 8.30గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ : 7036259922 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, సొల్లేటి ఉపేంద్రాచారి, బత్తుల దామోదర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, గురుచరణ్, ప్రియాంక, వెంకట్, ఉపేందర్ పాల్గొన్నారు.

వలంటీర్లకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నూతనకల్ : ఎన్నికల విధులు నిర్వహించే వీలేజ్ వలంటీర్లకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునిత, ఎస్‌ఐ జి సైదులు మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి ఒక్కరికీ పోలింగ్ కేంద్రాల వద్ద వలంటీర్లు సహాయ సహకారాలు అందించడంతో పాటు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సహకరించాలని సూచించారు. ఓటర్లకు బూత్‌లపై అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శశికళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌ను పిచ్చాస్పత్రిలో చేర్పించాలి



మాట్లాడుతున్న మల్లెపాక సాయిబాబా

తుంగతుర్తి : హిందువులను కించపరిచే విధంగా మాట్లాడిన కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్‌ను పిచ్చాస్పత్రిలో చేర్పించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు .మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అద్దంకి దయాకర్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. సమావేశంలో నాయకులు సందీప్, పోచం సోమయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు

ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు (59) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడిది నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం గోరెంకలపల్లి స్వగ్రామం. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా దహన సంస్కారాల కోసం ప్రభుత్వం తరఫున రూ. 20 వేల నగదును మృతుడి కుటుంబీకులకు ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చక్రహరి నర్సింహారాజు, ఉపాధి హామీ సీడల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి సుధీర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గట్టికల్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని గట్టిగల్లు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో వరికొయ్యల నుంచి పరిసర ప్రాంతాల్లోని తాటి చెట్లు, వేప చెట్లు, సోనమ్మ కుంటలో ఉన్న తుమ్మ చెట్లు కాలి బుడిదయ్యాయి. అదే సమయంలో గాలి దుమారం రావడంతో మంటలు ఎక్కువయ్యాయి. ఫైర్ ఇంజిన్‌తో పాటు గ్రామస్తులు మంటలు ఆర్పారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘ఉపాధి’ జాతర

- జాజిరెడ్డిగూడెం మండలంలో పెరుగుతున్న కూలీల సంఖ్య
- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు



జాజిరెడ్డిగూడెంలో అత్యధికంగా ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు

అర్వపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు రోజురోజుకూ కూలీల సంఖ్య పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా అత్యధిక మంది కూలీలు వెళ్తున్న మండలాల్లో జాజిరెడ్డిగూడెం మండలం తృతీయ స్థానంలో నిలిచింది. మొన్నటి వరకు మండలంలో 3 వేల మంది వరకు కూలీలు పనులకు వెళ్లగా ఆ సంఖ్య ప్రస్తుతం 3,500మందికి చేరింది. ఎండల దృష్ట్యా ఉదయాన్నే కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఎక్కువగా చెరువుల్లో పూడికతీత, వరద కాలువల పనులు చేస్తున్నారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలుండగా అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి.

ప్రతిరోజూ 3,500మంది కూలీలు..

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ప్రతిరోజూ 3,500మందికి పైగానే కూలీలు పనులకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. మండలంలోని జాజిరెడ్డిగూడెం, కోదూరు, సూర్యనాయక్‌తండాలో ఎక్కువ మంది కూలీలు పనులకు వెళ్తున్నారు.

ఎండలకు జాగ్రత్తలపై అవగాహన..

అధికారులు, ఇతర సిబ్బంది ప్రతిరోజూ ఉపాధి పనుల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నారు. కూలీలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ఎండలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కాగా ఉపాధి కూలీలకు మొన్నటి వరకు 3 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉండగా విడుదలయ్యాయి. బిల్లుల చెల్లింపు కూడా పూర్తి కావస్తోంది. గ్రామాల్లో ప్రస్తుతం చెరువులు, వరద కాలువల్లో పూడికతీత పనులు ఎక్కువగా చేపడుతున్నారు. దీంతో రానున్న వానాకాలంలో నీళ్లు అధికంగా ఇంకి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

అందరం పనులకు వెళ్తున్నాం



“ మా కుటుంబం అంతా ఉపాధి పనులకు వెళ్తున్నాం. ఉపాధి హామీ పథకం ద్వారా మాకు ఉపాధి లభిస్తోంది. వంద రోజుల పనిదినాలను పెంచితే ఎక్కువ పని చేసుకునే అవకాశం ఉంటుంది. ఎండల దృష్ట్యా పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలి.

– వేముల మధు, ఉపాధి కూలీ, అర్వపల్లి

కూలీల సంఖ్య పెరుగుతోంది



“ కూలీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ వేసవిలో తొలుత 600 మందితో పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం 3,500 మంది ఉపాధి పనులకు వస్తున్నారు. ఇందులో మహిళలే ఎక్కువగా ఉన్నారు. కొలతల ప్రకారం పనులు చేసే వారికి రూ.300 కూలి వస్తుంది.

– చిలుక ఉపేందర్, ఉపాధి పథకం ఏపీఓ

‘తుంగతుర్తి’కి రూ.172 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే మందుల సామేలు వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదు నెలల వ్యవధిలో తుంగతుర్తి నియోజకవర్గానికి వివిధ పనుల నిమిత్తం రూ.172 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మందుల సామేలు వెల్లడించారు. అర్వపల్లిలో మంగళవారం జరిగిన జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాల కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలలో భాగంగా కొన్ని అమలులోకి వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి రూ.2లక్షల రుణమాఫీ అమలవుతుందని చెప్పారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అర్వపల్లిలో బుధవారం రాత్రి జరిగే కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలనుద్దేశించి ఫోన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసెంబ్లీ ఇన్‌చార్జి సామ అభిషేక్‌రెడ్డి, ఆకుల బుచ్చిబాబు, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, పాలకుర్తి రాజయ్య, కడియం పరమేశ్వర్, పాశం యాదవరెడ్డి, నిద్ర సంపత్, అశోక్‌రెడ్డి, లింగయ్య, పూలమ్మ, రాంబాబు, సోమన్న, మాజీ జడ్పీటీసీ ఆవిలయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం



కొమ్మాలలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ ఉపేందర్

అర్వపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ఆ పథకం మండల అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ చిలుక ఉపేందర్ చెప్పారు. మండల పరిధిలోని కొమ్మాలలో మంగళవారం జరుగుతున్న చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం కూలీలకు బిల్లుల చెల్లింపు జరుగుతుందని చెప్పారు. వడదెబ్బకు గురికాకుండా కూలీలు ఉదయం వేళలో పనులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కుక్కడం శైలజ, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



నూతనకల్ : మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నూతనకల్ : భువనగిరి పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఓటర్ల వద్దకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తీగల గిరిధర్‌రెడ్డి, మహేశ్వరం చంద్రకళవెంకటయ్య, బొడ్డుపల్లి అంజయ్య, దేవిరెడ్డి నర్సిరెడ్డి, ఇమ్మారెడ్డి రాజాబహదూర్‌రెడ్డి, జటంగి గణేష్, నకిరేకంటి వెంకన్న, చురుకంటి చంద్రారెడ్డి, ఇరుగు మధు, అనంతుల వెంకన్న, బండారు లింగారెడ్డి, యాస పుల్లారెడ్డి, బండపల్లి యాదగిరి, ఎస్‌కె అబ్బాస్, బద్దం వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

అర్వపల్లి: భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురంలలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, దాసరి సోమయ్య, శిగ నసీర్‌గౌడ్, నర్సింగ కృష్ణమూర్తి, మామిడి సత్యనారాయణ, నర్సింగ వెంకటేశ్వర్లు, ఎల్లంల కొమిరెల్లి, తిమ్మాపురం మాజీ సర్పంచ్ పాలెల్లి సురేష్, వేములకొండ ఉప్పలయ్య, రత్నం లక్ష్మాజీ, చినతిరుమలరావు, వాసుదేవరెడ్డి, ఏకస్వామి, నాగేందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్య స్థాపనకు పాటుపడాలి

- మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



సూర్యాపేటలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

సూర్యాపేట : దేశంలో ఇందిరమ్మ రాజ్య స్థాపనకు ప్రతి ఒక్క కార్యకర్త కృషిచేయాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ కుడకుడ, కోమటికుంట, బాలాజీనగర్ మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్లు మామిడి గౌరవయ్య, ఎలిమినేటి అభినయ్, జహీర్, బైరు శైలేందర్, పట్టణ అధ్యక్షుడు అంజద్ అంజలీ, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ళ రమేష్, మాజీ కౌన్సిలర్ వర్దెల్లి శ్రీహరి, గునగంటి వంశీ, గండూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ అభినయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిక

15వ వార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలకు రాజీనామా చేసి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రావుకొల్లు వెంకన్న, రావుకొల్లు లింగయ్య, సీతా ప్రతాప్, కట్టోజు ప్రభాకర్ తోపాటు 100 మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో దోచుకున్నారు

ఆత్మకూరు (ఎస్) : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజా ధనాన్ని దోచుకుని దాచుకోవడమే లక్ష్యంగా పదేళ్ల పాలన కొనసాగించారని మాజీ మంత్రి ,కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని కోటినాయక్ తండా, పాత సూర్యాపేట, నెమ్మికల్, కందగట్ల, కొత్త తండా, బోరింగ్ తండా, పాతర్లపహాడ్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొప్పుల వేణా రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకుంటాం

అకాల వర్షానికి పవర్ లూమ్ యంత్రాలను నష్టపోయిన చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ మంత్రిరాంరెడ్డి దామోదర్ రెడ్డి భరోసా కల్పించారు. మంగళవారం మండలంలోని పాతర్లపహాడ్ స్టేజి వద్ద ఈదురుగాలులకు నష్టపోయిన బాధితులను పరామర్శించారు. వారి వెంట కొప్పుల వేణారెడ్డి ఉన్నారు.

అల్లూరి స్ఫూర్తితో బీజేపీని ఓడించాలి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు (ఎస్) : అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకుని ప్రజలంతా పాసిస్టు బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య పిలుపునిచ్చారు. మంగళ వారం మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో పీవైఎల్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, నాయకులు పోతురాజు ప్రతాప్, కొరివి అంజయ్య, అల్లి వీరయ్య, వరికుప్పల మల్లయ్య, మల్లమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జునరెడ్డి



తిరుమలగిరి : గుండెపురిలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న మల్లు నాగార్జునరెడ్డి

తిరుమలగిరి : కష్టజీవుల హక్కుల కోసం పోరాడే సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని గుండెపురి గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు మోపిందన్నారు. ఇష్టానుసారం ధరలు పెంచడం మూలంగా పేద, మధ్యతరగతి ప్రజలపై తీరని భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన మేడే సత్తయ్య, బొడ్డు మల్లయ్య నాయకత్వంలో వివిధ పార్టీలకు చెందిన 11 కుటుంబాలు సీపీఎంలో చేరాయి. కార్యక్రమంలో నాయకులు మట్టిపల్లి సైదులు, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, వేల్పుల వెంకన్న, కడెం లింగయ్య, కడారి లింగయ్య, వనం సోమయ్య, రాయల రాజకుమార్, సోమయ్య పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడే అభ్యర్థినే గెలిపించాలి

నూతనకల్ : పేద ప్రజల పక్షాన పోరాడే అభ్యర్థినే ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా వెంకట్‌రెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామంలో సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఉపాధి హామీ కూలీలను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బత్తుల జనార్దన్, దూదిగామ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెంలో ఇంటింటి ప్రచారం

అర్వపల్లి: భువనగిరి పార్లమెంట్ సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ జాజిరెడ్డిగూడెంలో మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, చెరుకు ఏకలక్ష్మి, నర్సింహారావు, రవి, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, వజ్జె సైదులు, శిగ వెంకన్న, శ్రీను, రవి, శ్రీకాంత్, విజయ్, అబ్బులు, బుచ్చిరాములు, వీరస్వామి పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

అర్వపల్లి: మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన తాందారపల్లి శ్రీరాములు అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరగా వైద్యం కోసం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన రూ. 2.15 లక్షల ఎల్‌ఓసీని మంగళవారం మాజీ సర్పంచ్ జాల నర్సయ్య బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాంద్ర లింగయ్య, వల్లపు శ్రీను, జాల నరేష్, జాల నాగరాజు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ కాపీని అందజేస్తున్న మాజీ సర్పంచ్ జాల నర్సయ్య

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

నూతనకల్ : బీజేపీ ద్వారానే దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. అవినీతి రహిత పాలన కోసం బీజేపీ అభ్యర్థినే ఎన్నికల్లో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, బత్తిని లక్ష్మయ్య, బద్దం వెంకట్‌రెడ్డి, బండపల్లి బుచ్చిరాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

తుంగతుర్తి : మండల పరిధిలోని వేంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వెంకన్న తోపాటు మరి కొంతమంది మంగళవారం ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. వేంపల్లి గ్రామం చెందిన మాజీ ఉపసర్పంచ్ వెంకన్నతో పాటు సుమారుగా మరో 50 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అబ్బ గాని సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పంది సంపత్, సందీప్, కేశారపు వెంకన్న, చల్లగుండ్ల చంద్రశేఖర్, పంది అర్జున్, మాలోతు నర్సింహతో పాటు కొంత మంది మంగళవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కె.అవిలయ్య, దండ వీరారెడ్డి, పుప్పాల సోమశేఖర్, మాజీ సర్పంచ్ కనకమ్మ, యాకూబ్, కుంభం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరించిన కాంగ్రెస్



చివ్వెంల : జి.తిర్మలగిరి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చివ్వెంల : రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని చివ్వెంల జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జి.తిర్మలగిరి, గుంజలూరు గ్రామాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

అర్వపల్లి: భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మంగళవారం ఉయ్యాలవాడ, కుమ్మరిగూడెంలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, మన్నె సింహాద్రి, తొట్ల శ్రీనివాస్, గుండె ఈశ్వర్, పిట్టల నర్సయ్య, సోమయ్య, వెంకన్న , నాగయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఓడించాలి

నూతనకల్ : మోసపూరిత హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రపహాడ్, దిర్శనపల్లి, పెదనెమిల, కొత్తతండా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నిక ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి బత్తుల సాయిలుగౌడ్, చూడి లింగారెడ్డి, గుగులోతు సురేందర్‌నాయక్, గాజుల తిర్మల్‌రావు, గాద్దుల లింగరాజు, బిక్కి బుచ్చయ్య, బత్తుల విద్యాసాగర్, మహేశ్వరం మల్లికార్జున్, మల్లయ్య, వీరు యాదవ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్)లో తాగునీటి సరఫరా బంద్

- మూడు రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఈదురుగాలులకు పంచాయతీ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడమే సమస్యకు కారణం



ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో ట్యాంకర్ వద్ద మంచి నీటిని పట్టుకుంటున్న ప్రజలు

ఆత్మకూరు (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలో మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఇటీవల వీచిన ఈదురుగాలులకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నడిచే బోర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సమస్య ఏర్పడింది. వీటికి మరమ్మతులు చేయకపోవడంతో మోటార్లు నడవక మండల కేంద్రంలోని బస్టాండ్ ఏరియా, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, మసీద్ ప్రాంతాల్లో మంచినీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ మోటార్లకు విద్యుత్ నిలిచిపోవడంతో పాటు మిషన్ భగీరథ నీళ్లు సైతం రాకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ కార్యదర్శి తన సిబ్బంది ద్వారా మంచినీటి ట్యాంకర్లు పంపించారు. అయితే అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ సమస్య పరిష్కరించడంతోపాటు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఈదురుగాలికి బోల్తాపడిన వ్యాన్



జాజిరెడ్డిగూడెం శివారులో రోడ్డు పక్కన బోల్తాపడిన వ్యాన్

అర్వపల్లి: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం భారీగా ఈదురు గాలులు వీయడంతో మామిడి, నిమ్మతోటల్లో కాయలు రాలిపడడంతో నష్టం వాటిల్లింది. జాజిరెడ్డిగూడెం శివారులో నకిరేకల్ నుంచి అర్వపల్లి వైపు వస్తున్న వ్యాన్ గాలికి అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న వారు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నేరేడుచర్ల : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూర్‌నగర్ సీఐ యలమందరాజు అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మంగళవారం రాత్రి నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్డన్ సెర్చ్‌లో పత్రాలు లేని 30 బైక్‌లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి ఎస్‌ఐలు రవీందర్‌నాయక్, లింగయ్య, సైదులు ఉన్నారు.

వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి

చిలుకూరు : వాతావరణంలో వచ్చే మార్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి సూచించారు. మంగళవారం చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలు దాటిన మహిళలు సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ విషయంపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. గ్రామాల్లో సాధారణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆశాలకు సూచించారు. వడదెబ్బకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, లక్ష్మీప్రసన్న, దీక్ష, జోష్న, స్వాతి, సావిత్రి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు : వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కళ్యాణ చక్రవర్తి